# బాలమిత్ర

- వాసంతి మాఘపు.

మహాభారతములో ముఖ్యమైన సంఘటనలను తెలియజేస్తూ, భారతమును ఒక వాక్యంలో చెప్పారు మన పూర్వులు. అది తెలుసుకుందాం!

**ఏకశ్లోకీ భారతం:**

ఆదౌ పాండవ ధార్త రాష్ట్రజననం
లాక్షాగృహేదాహనం
ద్యూతే శ్రీ హరణం వనేవిహరణం
మత్స్యాలయేవర్ధనం
శ్రీమద్గోగ్రహణే రణే విహరణం
సంధిక్రియా లంబనం
పశ్చాద్భీష్మ సుయోధనాది హననం
యేతన్మహాభారతం.

**అర్థములు:**
ధార్తరాష్ట్రుడు = ధృతరాష్ట్రుని కొడుకు, దుర్యోధనుడు.
మత్స్యాలయము = విరాటదేశము.
పశ్చాద్భీష్మ = పశ్చాత్ + భీష్మ.

**పద్యం:** *దొరలు దోచలేరు, దొంగలెత్తుకపోరు*
*భ్రాతృజనము వచ్చి పంచుకోరు*
*విశ్వ వర్ధనంబు విద్యాధనమ్మురా*
*లలిత సుగుణజాల! తెలుగుబాల!*

**అర్థం:** విద్య అనే ధనాన్ని దొరలు దోచుకు పోలేరు. దొంగలు ఎత్తుకు పోలేరు. అన్నదమ్ములు పంచుకోలేరు. విద్యాధనము అందరి అభివృద్ధికి తోడ్పడుతుంది.

**సూక్తి:** తన కోపమె తన శత్రువు..

**అర్థం:** మన కోపమే మనకు శత్రువు. ఎలాగంటే, కోపముతో ఊగిపోయేటప్పుడు మనము ఆలోచించే శక్తిని కోల్పోతాము. దీనివలన మనము మామూలుగా ఉన్నప్పుడు చేసే పనిని కూడా చేయలేము.

అందుకే భగవద్గీతలో

*"క్రోధాద్భవతి సమ్మోహ:*
*సమ్మోహాత్ స్మృతి విభ్రమ:*
*స్మృతి భ్రంశాత్ బుద్ధినాశ:*
*బుద్ధినాశాత్ ప్రణశ్యతి."*

అని చెప్పబడింది.

## పదమేంటో చెప్పుకోండి!

క్రింద ఇచ్చిన ఆధారములనుపయోగించి పదమేంటో చెప్పుకోండి!

1. ఇది 6 అక్షరముల ఊరి పేరు.
2. చివరి మూడు అక్షరములు పట్టణమును తెలియజేస్తాయి.
3. మొదటి రెండు అక్షరములు ఏనుగును తెలియజేస్తాయి.
4. మూడవ అక్షరము మరియు ఐదవ అక్షరము కలిసి పీచు అనే అర్థాన్నిస్తాయి.

ఏమిటా పదం?

## సమాధానం చెప్పగలరా? ప్రయత్నించండి!

1. కళ్ళు మూసుకుని చెయ్యగలిగేది, కళ్ళు తెరచి చెయ్యలేనిది. ఏమిటి?
2. 'శ్రీమద్రామాయణం'లో నున్నది. 'మహాభారతం'లో లేనిది. ఏమిటి?

(సమాధానములు వచ్చే సంచికలో)

గత సంచికలోని **'సమాధానం చెప్పగలరా?'** సమాధానములు.

1. ఈ కారు స్పీడేవేరు. కాని చక్రాలమీద నడవదు. కాళ్లపైనే నడుస్తుంది. అదే కుర్రకారు..
2. పంచినకొద్దీ పెరిగేవి విజ్ఞానం, మంచితనం, ఆనందం.

*తప్పు- ఒప్పు: చిలక అని వ్రాయడం తప్పు. చిలుక అని వ్రాయడం ఒప్పు.*

# అసహనం




ఒక భక్తుడు లక్ష్మీదేవిని ఎంతో శ్రద్ధాభక్తులతో ఎన్నో సంవత్సరములు పూజించేవాడు. ఎట్టకేలకు ఒకరోజు దేవి ప్రత్యక్షమై, అతనికి ఏమి కావలెనో కోరుకొమ్మనెను. అతడు భక్తితో దేవికి నమస్కరించి "అమ్మా! నీవు నాతో వేంచేసి, మా ఇంట్లోనే కొలువుండవమ్మా!" అని ప్రార్థించెను. అప్పుడు దేవి "సరే! నేను నీతోనే వస్తాను. కాని ఒక షరతు. నీవు నా కంటె ముందుగానే నడవాలి. నేను నిన్ను అనుసరించి వస్తాను. నీవు మాత్రము వెనుకకు తిరిగి చూడకూడదు. అలాచూస్తే, నేను ఎప్పటికీ అక్కడే శిలారూపంలో నిలిచిపోతాను." అని చెప్పెను.

ఆనంద పరవశుడై తన ఇంటివైపు దారితీసెను. లక్ష్మీదేవి ఆ భక్తుని అనుసరిస్తూ పోసాగింది. ఆమె నగలు అనేక శబ్దములను చేయసాగెను. ఇలా కొంత దూరము భక్తుడు సాగిపోయెను.

లక్ష్మీదేవి నగల శబ్దము వినగా వినగా, ఆమె ఎలాంటి నగలు ధరించినదో, అమె దివ్యమైన రూపము ఎలా ఉంటుందో చూడాలనే కుతూహలము అతనిలో పెరిగిపోయింది. అతనిలో సహనము నశించి వెనుకకు తిరిగి చూసాడు. అంతే! దేవి శిలారూపములో అప్పటికప్పుడే స్థిరపడిపోయింది. ఆ భక్తుడు ఏడవడం మినహా, మరేమీ చెయ్యలేకపోయాడు. అతను ఇంటికి చేరేవరకు కాస్త ఓపిక పట్టి ఉంటే పరిస్థితి మరొక రకముగా ఉండేది.

*ఈ కథ వలన నేర్చుకున్న నీతి ఏమిటి?*

*భగవంతుని కృప అపారముగానున్నా కూడా, ఆ దివ్యశక్తియొక్క ఆజ్ఞను శిరసావహించి నడుచుకోవడానికి ఎంతో నిగ్రహం కావాలి. నిగ్రహం లేనినాడు భగవంతుని కృపకు పాత్రుడు కావడం అసాధ్యం. భక్తునికి పూర్తి విశ్వాసము లేకపోవడం ప్రళయసమానం.*